



- కనిష్ఠ స్థాయికి పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఒకవైపు చలి, మరోవైపు చల్లగాలులు
- గ్రామాల్లో చలిమంటలు వేసుకుంటున్న వృద్ధులు
- రాత్రి తొమ్మిదిదాటితే నిర్మానుష్యంగా మారుతున్న పట్టణాలు, గ్రామాలు
- ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ
- జనవరి చివరి వరకు ఇదే పరిస్థితి..
- చలికాలం జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

# చలి చంపేస్తోంది

## గజగజ వణికిపోతున్న ఉమ్మడి పాలమూరు

మహబూబ్‌నగర్, జనవరి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి పాలమూరు జిల్లాను చలి గజగజ వణికిస్తున్నది. రెండు మూడు రోజులుగా మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో ప్రజలు చలికి తల్లడిల్లి పోతున్నారు. ఒకవైపు చలి మరోవైపు చలి గాలులు ప్రజలను వణికిస్తున్నాయి. మధ్యాహ్నం ఎండ వచ్చినా చలి విపరీతంగా ఉండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిర వుతున్నారు. చాలా మంది ఉదయం వాకింగ్ వెళ్లే వారు చలి ప్రభావంతో బాగా తగ్గిపోయింది. కూరగాయలు, పాలు అమ్ముకునే చిరు వ్యాపారులు సైతం చలికి భయపడి పొద్దు ఎక్కిన తర్వాత గాని షాపులు తెరవడం లేదు. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో చల్లదనం పెరిగిపోతున్నది. జాతీయ రహదారులు గ్రామీణ రహదారులపై తెల్లవారుజామున ప్రయాణించాలంటే భయపడి పోతున్నారు. కొండాకోనలు గ్రామీణ ప్రాంతాలను చలి దుప్పటి కప్పేస్తున్నది. చలి తీవ్రత మంచు ప్రభావం వల్ల రహదారులు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉష్ణోగ్రతలు కనిష్ఠస్థాయికి పడిపోవడంతో సాయంత్రం కాగానే చలిమంటలు వేసుకుంటున్నారు. రాత్రి 8 అయ్యిందంటే చాలు గ్రామాలు, పట్టణాల్లో జన సంచారం పూర్తిగా తగ్గిపోతున్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఏకంగా 8° సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మిగతా జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి ఉండడంతో ఉత్తర భారత తాన్ని పాలమూరు జిల్లా తలపిస్తున్నది.

### కమ్మేసిన మంచు దుప్పటి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గత పది రోజులుగా చలి విపరీతంగా ఉండడంతో గ్రామాలు పట్టణాల్లో మంచు దుప్పటి కమ్మేస్తున్నది. పొద్దున్నే పొలాలకు వెళ్లాలనుకునే రైతులు వ్యవసాయ కూలీలు మంచు కారణంగా వెళ్లలేక పోతున్నారు. గ్రామీణ రహదారులు పట్టణ రహదారులన్నింటినీ మంచు కమ్మేయడంతోపాటు ఊటీని తలపిస్తున్నది. ఇక గుట్టల ప్రాంతాల్లో అయితే విపరీతంగా చలి ఏర్పడి ఉదయం తొమ్మిది అయినా ఇంకా మబ్బుల్లోనే ఉంటున్నాయి. బయట చలి తీవ్రతరం కావడంతో ప్రజలు ఉన్ని దుస్తులు ధరించి బయటకు వెళ్తున్నారు. ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే వాళ్లంతా గ్లౌజులు వేసుకొని బయటకి వస్తున్నారు. పొగ మంచు హైదరాబాద్ బెంగళూరు రహదారిని పూర్తిగా కప్పేస్తున్నది. భారీ వాహనాలు, బస్సులు, కార్లు ఈ రహదారిపై మీటర్ల దూరంలోనే వాహనాలు కనిపించక పోవడంతో లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా డ్రైవర్లు ఉదయం 9 గంటల వరకు తమతమ వాహనాలను రహదారుల పక్కన నిలిపిస్తున్నారు.

### చిరు వ్యాపారులపై చలి పంజ..

ఉమ్మడి జిల్లాలో తెల్లవారు జామునే కూరగాయలు, పాల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఉదయం నాలుగు గంటలకే లేచి కూరగాయలు, పాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలకు తీసుకువస్తుంటారు. జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీల్లో కూరగాయల వ్యాపారులు తెల్లవారు జామున వచ్చి కుప్పలుగా పోసుకొని అమ్ముకుంటున్నారు. చలి తీవ్రత వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని చిరు వ్యాపారులు బయటికి రావాలంటే వణికిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చలి ఉందని వాపోతున్నారు. ఫలితంగా పొదెక్కగానే కూరగాయలను తీసుకొని పట్టణాలకు వస్తే గిరాకీ లేక వెనుదిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇల్లిల్లు తిరిగి పాల వ్యాపారం చేసే పాల వ్యాపారులు సైతం తెల్లవారు జామున పాలను సరఫరా చేయలేక పోతున్నారు.

### కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రెండు మూడు రోజుల నుంచి చలి తీవ్రంగా ఉండడంతో మహబూబ్‌నగర్ జిల్లాలో 13° స్థాయికి చేరుకుంది. గద్వాలలో 11 డిగ్రీలు.. వనపర్తిలో 11 డిగ్రీలు.. నారాయణపేటలో 10 డిగ్రీలు.. నాగర్‌కర్నూల్‌లో పది డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. 15నుంచి 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉంటేనే చలి విపరీతం అనిపిస్తుంది. అలాంటిది ఏకంగా 10 డిగ్రీల వరకు పడిపోవడంతో పరిస్థితి ఏ విధంగా ఉందో ఊహించవచ్చు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా ఎండ ఉన్నప్పటికీ చలి తీవ్రత కనిపిస్తున్నది. బయట ఎండ ఉన్న ఇండ్లల్లో మాత్రం చలి ఉంటుందని మహిళలు అంటున్నారు. దీనికి తోడు చలిగాలుల ప్రభావం వల్ల గ్రామాలు పట్టణాలు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అయితే చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువగా బయట తిరగవద్దని, ముఖ్యంగా శ్వాసకోస సమస్యలు ఉన్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. - వనపర్తి టౌన్

# రైతులను దగా చేసిన కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, జనవరి 5 : రైతులను కాంగ్రెస్ నిలువూనా మోసగించిందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అలవి కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో చతికిలబడుతుందన్నారు. కేసీఆర్ రైతుబంధు రూ.10వేలు ఇవ్వగా, మేం అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామని గొప్పలు చెప్పిన రేవంత్‌రెడ్డి నేడు రూ.12వేలు ఇస్తామనడం సిగ్గుచేటన్నారు. రైతులను మోసం చేయడమే కాంగ్రెస్ ఎజెండాగా ఆయన అభివర్ణించారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఎకరాకు రెండు పంటలకు కలిపి రూ.15వేలు ఇస్తామని చెప్పి సంవత్సరం కాలంపాటు రైతులను మోసం చేసిందన్నారు. ఇప్పుడు రూ.12వేలు అందిస్తామని చెప్పడం ముఖ్యమంత్రికి రైతులపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకుతున్న రైతాంగానికి కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి పంటకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.5వేలు అందించి అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు రూ.15వేలు ప్రతి రైతు ఖాతాలో జమ చేయాలని, లేనిపక్షంలో బీఆర్‌ఎస్ తరఫున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

# నమ్మించి నయవంచన



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

- అమలు చేతకానప్పుడు హామీలెందుకివ్వాలి?
- రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి
- బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

అయిజ, జనవరి 5 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు రైతు భరోసా పథకం కింద ప్రతి ఏటా రూ.15వేలు ఇస్తామని వరంగల్ వేదికగా కాంగ్రెస్ శ్రేణులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే రైతులకు హామీ ఇచ్చి నయవంచనకు గురి చేశారని బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ఎద్దేవా చేశారు. ఆదివారం అయిజ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా పథకం కింద కేవలం రూ.12వేలు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. నైతిక విలువ లేని రేవంత్‌రెడ్డి రైతాంగానికి బహిరంగ క్షమాపణలు చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లు రూ.15వేలు ఇవ్వాల్సిందేనన్నారు. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతు కుటుంబాలను బజారున పడేసేలా కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నదన్నారు. రైతులంటేనే కాంగ్రెస్‌కు గిట్టదనే విషయం తేటతెల్లమైందని విమర్శించారు. రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేయకపోగా, రైతు భరోసాను రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12వేలు ఇస్తామని చెప్పడం వారి చేతగాని తనానికి నిదర్శనమన్నారు. ధాన్యం కొనుగోళ్లలోనే నిర్లక్ష్యం చేయడంతో చాలా మంది వ్యాపారులకు అమ్ముకొని నిండా మునిగారన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని, నేటికి రైతుల ఖాతాలో జమ చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసాలకు చిరునామాగా మారిందన్నారు. రైతు భరోసా గురించి వెల్లడించేందుకు మంత్రులు మాట్లాడేందుకు ముఖంచాటేయడం చూస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రులే పంగనామం పెట్టే సమయం ఆసన్నమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతు భరోసా కింద ఎకరాకు రూ.17,500 రైతులకు ఇవ్వాల్సి ఉండగా, నేడు రూ.6వేలు ఇచ్చి చేతులు దులుపుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తున్నదన్నారు. మిగితా రూ.11,500 ఎవరిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధి హామీ జాబ్‌కార్డులు కలిగిన రైతు కూలీలందరికీ ప్రతి యేటా రూ.12వేలు అందించాలన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూమి అంటే అర్థం ఏమిటో రేవంత్‌రెడ్డి రైతులకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ మండలాధ్యక్షుడు మత్తాలి, మాధవ్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ అసమర్థతతోనే వేధింపులు

- విద్యార్థినులకు పూర్తిస్థాయి వసతులు కల్పించాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



పాలిటెక్నిక్ విద్యార్థినులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, జనవరి 5 : రాష్ట్రంలో ఆడపిల్లలపై వేధింపులు పెరుగుతున్నాయని, ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో తీసుకున్న చర్యలతో ఆడపిల్లలను కన్నెత్తి చూడాలంటే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. ఆకతాయిల బెదిరింపులకు భయపడవద్దని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఆకతాయి బాత్రూంలో ఫోన్ పెట్టి వీడియో రికార్డు చేస్తే ఏమీ తెలియనట్లు కొందరు బుకాయించడం ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి ఘటనలు కళాశాలలు, పాఠశాలల్లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాలయాల్లో విద్యార్థినులకు పూర్తిస్థాయి వసతులతో మౌలిక వసతులు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థినులు ఏ సమస్యలు వచ్చినా ఉపాధ్యాయులు, అధ్యాపకులకు చెప్పుకునే విధంగా కళాశాలల్లో వాతావరణం కల్పించాలన్నారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వారి సమస్యలతో పాటు కావాల్సిన సౌకర్యాలపై అధికారులు అడిగి తెలుసుకోవాలని కోరారు. మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్‌కు బీఆర్‌ఎస్ హయాంలో ప్రత్యేక సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని, రూ.25 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు తీసుకువచ్చామన్నారు. అది పూర్తయితే విద్యార్థినులు నైపుణ్యం పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్చకులకు వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న అర్చక సంఘం అధ్యక్షుడు చక్రవర్తి

అయిజ, జనవరి 5 : ధూప దీప నైవేద్య అర్చకుల ఆకలి తీర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, తమకు వేతనాలు అందించాలని జిల్లా ధూప దీప నైవేద్య అర్చకుల అధ్యక్షుడు చక్రవర్తి కోరారు. ఆదివారం మండలంలోని సింధనూర్‌లో ధూప దీప నైవేద్య పథకం అర్చకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ.. ఎంతో మంది భక్తుల మనోభావాలను గౌరవించడంతోపాటు ప్రజలు, రైతులు, పాడి పంటలు పుష్కలంగా ఉండి సుభిక్షంగా ఉండాలని కోరుకునే అర్చకులకు గౌరవ వేతనం నాలుగు నెలలైనా చెల్లించక పోవడంతో అర్చకుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలో భాగంగా అర్చకులకు రూ.15వేల గౌరవ వేతనం అందిస్తామన్న హామీ అమలు చేయాలన్నారు. సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖరయ్యస్వామి, సభ్యులు సురేంద్రస్వామి, రఘుస్వామి, నాగఫణి శర్మ ఉన్నారు.



సినీ హీరో వెంకటేశ్‌కు రామానాయుడు చిత్రాన్ని బహూకరిస్తున్న హర్షద్‌ఖాన్

# డ్రాయింగ్ టీచర్‌ను అభినందించిన సినీనటుడు వెంకటేశ్

ఊట్కూర్, జనవరి 5 : మండలంలోని బిజ్వారం జెడ్పీహెచ్‌ఎస్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న హర్షద్‌ఖాన్ విద్యార్థులతో కలిసి ఆదివారం ప్రముఖ సినిమా హీరో విక్టరీ వెంకటేశ్‌ను హైదరాబాద్‌లో కలిశారు. కళా నైపుణ్యంతో గీసిన ప్రముఖ నిర్మాత డి.రామానాయుడు చిత్రాన్ని తన అభిమాన హీరో వెంకటేశ్‌కు బహూకరించారు. చదువుతోపాటు చిత్రకళలో నైపుణ్యత పొందిన తన శిష్యులు ఆనంద్, అనిల్‌ను అభిమాన హీరోకు పరిచయం చేయడంతో భవిష్యత్‌లో విద్యార్థులు మరింత ఉన్నతస్థితికి చేరాలని దీవించారు.

# నీటి సంపులోపడి రైతు మృతి


బిజినేపల్లి, జనవరి 5 : ప్రమాదవశాత్తు నీటి సంపులోపడి ఓ రైతు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వడ్డెమాన్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వడ్డెమాన్‌కు చెందిన గుంటి బంగారయ్య(40) రోజు మాదిరిగానే తన మక్కపంటకు నీరు పారపెట్టేందుకు వెళ్లాడు. ఈక్రమంలో పొలంలో ఉన్న నీటి సంపులో కాలుజారిపడ్డాడు. ఎవరూ గమనించకపోవడంతో సంపులోనే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీనివాసులు వెల్లడించారు.

# కరాటేలో స్వర్ణం సాధించిన విద్యార్థులు

నారాయణపేట టౌన్, జనవరి 5 : షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం ఆలిండియా 38వ కుంగ్ ఫూ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నారాయణపేటలోని మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతున్న జిల్లా కేంద్రానికి చెందిన మహేశ్వరి, దామరగిద్ద మండలానికి చెందిన శివశంకర్ ప్రతిభ చాటి గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రం అందుకున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను అకాడమీ నిర్వాహకుడు అశోక్ అభినందించారు.

# రేషన్ దందా..!

- గద్వాల జిల్లాలో పేదల బియ్యం పక్కదారి
- తక్కువ ధరకు కొనుగోలు చేసి మిల్లులకు తరలింపు
- తిరిగి సీఎమ్మార్‌గా ప్రభుత్వానికి అప్పగింత
- మిల్లర్లకు సహకరిస్తున్న అధికారులు
- డిసెంబర్‌లో 161, జనవరిలో 153 క్వింటాళ్లు పట్టివేత
- 62 కేసులు నమోదు



ఉప్పల క్యాంప్ వద్ద గోదాంలో నిలువ ఉంచిన బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గద్వాల, జనవరి 5 : పేదల ఆకలిని తీర్చే రేషన్ బియ్యాన్ని కొందరు అధికారులు సహాయంతో పక్కదారి పట్టిస్తున్నారు. కొందరు రేషన్ డీలర్లు, మిల్లర్లకు కాసులు కురిపిస్తున్నది. కరోనా నాటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచితంగా బియ్యం అందిస్తుండగా, డీలర్లు పక్కదారి పట్టిస్తుండడంతో మిల్లర్లు కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి తిరిగి సీఎమ్మార్‌గా అప్పగిస్తున్నారు. ఇందుకు సివిల్ సప్లయ్‌శాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులు అటు డీలర్లకు, ఇటు మిల్లర్లకు సహకరిస్తుండడంతో జిల్లాలో వారి దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్నది. కొందరు డీలర్లు తమకు చెందిన రేషన్ దుకాణాలను మరొకరికి బినామీగా ఇచ్చి అక్రమ దందాకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం చౌకధర దుకాణాల ద్వారా అందించే రేషన్ బియ్యం సరిహద్దులు దాటుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. డీలర్లు రేషన్‌దారుల నుంచి తక్కువ ధరలకు సేకరించి మిల్లర్లకు, రాయచూర్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**జోరుగా రేషన్ బియ్యం సేకరణ..**

జిల్లాలో 333 చౌకధర దుకాణాలున్నాయి. 1,60,571 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెలా 4,100 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. అయితే లబ్ధిదారులు 2,914 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే తీసుకుంటున్నట్లు సమాచారం. జిల్లాలో రేషన్ బియ్యం సేకరణ జోరుగా సాగుతున్నది. లబ్ధిదారులతోపాటు డీలర్ల నుంచి దళారులు బియ్యాన్ని సేకరిస్తున్నారు. కిలో రూ.8కొనుగోలు చేసి వాటిని మిల్లర్లకు రూ.12నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. మిల్లర్లు వీటిని రీసైక్లింగ్ చేసి ఎఫ్‌సీఐకు సరఫరా చేస్తున్నారు.

**రేషన్ దుకాణాల నిర్వహణ ఇష్టారాజ్యం..**

జిల్లాలో రేషన్ దుకాణాల నిర్వహణ ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నది. పేరు ఒకరిదైతే నిర్వహణ మరొకరు చేస్తూ రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ దుకాణం దక్కించుకున్న డీలర్, వివిధ కారణాలతో తొలగించిన డీలర్ల స్థానంలో కేటాయించిన ఇన్‌చార్జీలు మాత్రమే సరుకులు పంపిణీ చేయాలి. అలా కాకుండా బినామీలు నిర్వహిస్తూ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. దీనికి తోడు డీలర్లకు మాత్రమే తెలియాల్సిన ఈ-పాస్ మిషన్ల కీ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బినామీల చేతుల్లోకి వెళ్లాయి. దీంతో వారే ఓపెన్ చేసి బియ్యం పంపిణీ చేస్తున్నారు. రేషన్ దుకాణాలపై పర్యవేక్షణ లేక పోవడంతో బినామీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పలు కారణాలతో డీలర్ల వద్ద మిగిలిన బియ్యం రైస్ మిల్లులకు చేరి రీ సైక్లింగ్ తర్వాత ఎఫ్‌సీఐ గోదాంకు వెళ్తున్నట్లు తెలుస్తున్నది. జిల్లాలో బినామీ డీలర్లు కీ రోల్ పోషిస్తున్నట్లు సమాచారం. రెండు, మూడు సంవత్సరాల్లో జిల్లాలో అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 50మంది డీలర్లను తొలగించారు. అయితే ఖాళీ స్థానాల్లో వెంటనే కొత్త డీలర్లను ఆర్డీవో నియమించాల్సి ఉండగా, చేపట్టడం లేదు. కాగా, చాలా సందర్భాల్లో పార్టీలు మారినప్పుడల్లా ఇతర పార్టీలకు చెందిన డీలర్లను తొలగిస్తున్నారన్న ఆరోపణలతో ఈ విషయాన్ని కొందరు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఒకరిని నియమించిన స్థానంలో కొత్త వారిని తీసుకోవద్దని హైకోర్టు తీర్పునిచ్చింది. సమీపంలోని డీలర్లకు బాధ్యతలు అప్పగించాలని సూచించింది. అదే అదునుగా భావించిన అధికారులు ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు దుకాణాలు కట్టబెట్టారు. ఇన్‌చార్జి తీసుకున్న వారు తమకు నచ్చిన వారికి బినామీలుగా పెట్టుకోవడంతో నిర్వహణ ఇష్టారాజ్యంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి పేదల బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**గతేడాది జనవరి నుండి డిసెంబర్ వరకు**

జిల్లాలో గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు గద్వాల, గట్టు, కేటీదొడ్డి, ఇటిక్యాల, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి, మానవపాడ్ మండలాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి అక్రమంగా నిల్వ ఉంచిన 972 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. 62కేసులు నమోదు చేశారు. జిల్లాలో పీడీఎస్ బియ్యం దందా ప్రతి ఏడాది రూ.కోటికి పైగా లావాదేవీలు కొనసాగుతున్నట్లు సమాచారం. అధికారులు పట్టుకున్న బియ్యం విలువ సుమారు రూ.15లక్షలపైనే ఉంటుందని సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు.వీటితో పాటు ఈ ఏడాది జనవరి 4 శనివారం రాష్ట్రవిజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన దాడుల్లో దువాసిపల్లి సమీపంలో ఏకంగా 153 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేశారు.

# దేపల్లిలో ఎర్రమట్టి దందా

- రాత్రి వేళల్లో అక్రమంగా తరలింపు
- స్థానిక నాయకుల అండ
- చోద్యం చూస్తున్న అధికారులు

నవాబ్‌పేట, జనవరి 5 : మండలంలోని దేపల్లి నుంచి ఎర్రమట్టి యథేచ్ఛగా తరలి పోతున్నది. 10రోజుల నుంచి వందల కొద్ది టిప్పర్ల ద్వారా ఎర్రమట్టి తరలించుకుపోతున్నా అడిగే నాథుడే లేడు. మండలంలోని దేపల్లి శివారులోని కొంత మంది రైతుల వ్యవసాయ పొలాల నుంచి శంషాబాద్‌కు చెందిన ఇటుకల వ్యాపారులు అక్రమంగా ప్రతి రోజూ టిప్పర్ల ద్వారా ఎర్రమట్టిని తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామాల్లోని రైతుల పొలాల నుంచి సైతం మట్టిని తరలించినా గ్రామ పంచాయతీలో ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే మైనింగ్ అధికారుల అనుమతి కూడా తీసుకోవాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ కొంత మంది స్థానిక నాయకులు మధ్యవర్తిత్వం వహించి పట్టాదారు రైతులకు నయానో, బయానో చెల్లించి రూ.లక్షల విలువజేసే మట్టిని తరలించుకుపోతున్నారు. ఈ దందా 10 రోజుల నుంచి కొనసాగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. రాత్రి వేళ అక్రమంగా టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. 200 టిప్పర్ల ఎర్రమట్టిని ఇటుకల దందాకు తరలించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కొందరు గ్రామస్తులు గురువారం అర్ధరాత్రి అక్రమ మట్టి తరలింపును అడ్డుకునేందుకు ప్రయత్నించగా, వారిని వ్యాపారులు బెదిరించినట్లు తెలిసింది. ఈ విషయమై తాసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. రైతుల పొలాల్లో సైతం మట్టి తరలించాలన్నా ఖచ్చితంగా మైనింగ్ అధికారుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈ విషయాన్ని మైనింగ్ అధికారులకు తెలియజేసి విచారణ చేపడతామన్నారు.



దేపల్లి శివారు పొలాల్లో ఎర్రమట్టి కోసం తవ్విన గోతులు